

## షూటింగ్ చాంపియన్ సయ్యద్ మునావర్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) వేదికగా జరిగిన స్పోర్ట్స్ ఫర్ ఆల్(ఎస్ఎఫ్ఏ) షూటింగ్ చాంపియన్‌షిప్‌లో యువ షూటర్ సయ్యద్ మునావర్ హుస్సేన్ 10మీటర్ల విభాగంలో స్వర్ణ పతకంతో మెరిశాడు.

## ఏషియన్ ముక్తా సంస్థలకు టోకరా

### బోగస్ బ్యాంక్ అకౌంట్లతో ఉద్యోగి మోసం

### సినీ నిర్మాత ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు

బంజారాహిల్స్, అక్టోబర్ 26: బోగస్ కంపెనీల పేర్లతో బ్యాంక్ అకౌంట్లను సృష్టించి.. ప్రముఖ సినీ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ సునీల్ నారంగ్‌కు చెందిన అకౌంట్‌నుంచి డబ్బులు కాజేసిన ఉద్యోగితో పాటు మరో ఇద్దరిపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదయింది. పోలీసుల వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నం. 31లో ఏషియన్ ముక్తా ఏ-2 సంస్థ పేరుతో నిర్మాత సునీల్ నారంగ్ కార్యాలయం నడిపిస్తున్నారు. ఇందులో విశ్వనాథరెడ్డి అనే వ్యక్తి గత ఏడేళ్లుగా అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. కాగా.. గత కొన్నేళ్లుగా విశ్వనాథరెడ్డి.. తన భార్య సఫియా నసీర్, స్నేహితుడు శశాంక్‌తో కలిసి కొన్ని బోగస్ సంస్థల పేర్లతో బ్యాంక్ అకౌంట్లు తెరిచారు. హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్, సాయి నైన్ ఎంటర్ ప్రైజెస్, తదితర పేర్లతో ఉన్న ఈ బ్యాంకు ఖాతాలకు పలు సందర్భాల్లో డబ్బులు పంపించారు. బోగస్ లెక్కలు చూపిస్తూ ఆయా సంస్థల పేర్లమీదకు రూ.1.47కోట్ల మేర నిధులు పంపించినట్లు ఇటీవల నిర్వహించిన ఆడిట్‌లో తేలింది. ఏసియన్ సంస్థ సీఎఫ్‌వో రాజశేఖర్ యాదవ్, సీఈవో వరుణ్ మల్హోత్రా, మేనేజింగ్ పార్టనర్ సునీల్ నారంగ్ పేర్లతో చెక్కులు తీసుకుని డబ్బులు తమ ఖాతాల్లోకి మళ్లించినట్లు తేలింది. దీంతో తమ సంస్థను మోసం చేసిన విశ్వనాథరెడ్డితో పాటు సఫియా నసీర్, శశాంక్, తదితరులపై చర్యలు తీసుకోవాలంటూ నిర్మాత సునీల్ నారంగ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అద్దెకు ఇచ్చిన ఇల్లు కూల్చివేత

### అడ్డుకునేందుకు జేసీ దివాకర్‌రెడ్డి వెళ్తే బెదిరింపులు

### కేసు నమోదు చేసిన పోలీసులు

బంజారాహిల్స్,అక్టోబర్ 26: తమ వద్ద అద్దెకు తీసుకున్న ఇంటిని.. వేరొకరికి ఇచ్చే ప్రయత్నాల్లో భాగంగా కూల్చివేతలు చేపట్టడంపై ప్రశ్నించేందుకు వెళ్లిన మాజీ మంత్రి జేసీ దివాకర్‌రెడ్డి, మేనేజర్‌లను బెదిరింపులకు గురిచేయడంతోపాటు దాడికి యత్నించారు. ఈ సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత జేసీ దివాకర్‌రెడ్డికి జూబ్లీహిల్స్ రోడ్ నం.62లోని ప్లాట్ నంబర్ 1250లో ఉన్న ఇంటిని సాహితీ సంస్థ చైర్మన్ బూదాటి లక్ష్మీనారాయణకు 2020లో అద్దెకు ఇచ్చాడు. మూడేళ్ల గడువు ముగిసిన తర్వాత ఇంటిని ఖాళీ చేయాలని కోరగా.. బూదాటి కొడుకు సాత్విక్ మిస్టిక్ వెల్‌నెస్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఓ బోగస్ అగ్రిమెంట్‌ను సృష్టించి కోర్టులో కేసు వేశాడు. ఈ వ్యవహారంపై గతంలోనే సివిల్, క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇదిలా ఉండగా వారం రోజుల క్రితం జేసీ దివాకర్‌రెడ్డితోపాటు అతడి మేనేజర్ జగదీశ్ యాదవ్‌లు ప్లాట్ నంబర్ 1250లో ఉన్న ఇంటి వద్దకు వెళ్లారు. అక్కడ ఉన్న ఇంటిని కూల్చేసి స్థలాన్ని చదును చేస్తున్నట్లు గుర్తించిన జేసీ షాక్‌కు గురయ్యారు. ఏడాది కాలంనుంచి అద్దె చెల్లించకపోవడంతో పాటు కోర్టులో తప్పుడు పత్రాలతో కేసులు వేశారని, తమ అనుమతి లేకుండా ఇంటిని ఎలా కూలుస్తారంటూ అక్కడున్న రాజీవ్ సాల్మన్ అనే వ్యక్తిని ప్రశ్నించారు. దీంతో రాజీవ్ సాల్మన్‌తో పాటు ఇతర వ్యక్తులు జేసీ దివాకర్‌రెడ్డి, జగదీశ్ యాదవ్‌లను అక్కడినుంచి వెళ్లిపోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇంటిని కూల్చిన ఫొటోలు తీసేందుకు యత్నించడాన్ని అడ్డుకున్నారు.ఈ స్థలాన్ని సినిమా వాళ్లకు అద్దెకు ఇచ్చారని, ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేసేందుకు యత్నిస్తున్నారంటూ జగదీశ్‌యాదవ్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సీట్లు, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం

బంజారాహిల్స్, అక్టోబర్ 26: మెడికల్, ఇంజినీరింగ్ సీట్లు, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నమ్మించి పలువురు బాధితుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసిన మోసగాడిపై జూబ్లీహిల్స్ పోలీసులు చీటింగ్ కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీనగర్ కాలనీలో రోహిత్ అనే వ్యక్తి ఆరునెలల క్రితం చెక్‌మేట్ కన్సల్టెన్సీ పేరుతో కార్యాలయం ఏర్పాటు చేశాడు. విదేశాల్లో మెడిసిన్ సీట్లు, మేనేజ్‌మెంట్ కోటాలో ఇంజినీరింగ్ సీట్లు ఇప్పిస్తానంటూ నమ్మించి పలువురివద్దనుంచి లక్షలాది రూపాయలు వసూలు చేశాడు. అయితే నెలలు గడిచినా సీట్లు రాకపోవడంతో పాటు రోహిత్ బిచాణా ఎత్తేయడంతో శనివారం పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. రంగారెడ్డి నగర్‌కు చెందిన పరశురామ్ కుమార్తెకు ఈ కాలేజీలో మేనేజ్‌మెంట్ కోటా కింద సీటు ఇప్పిస్తానంటూ రూ.12లక్షలు వసూలు చేసి మోసం చేశాడు. కృష్ణదేవరాయనగర్‌కు చెందిన పాగల నందిని వద్దనుంచి విదేశాల్లో ఉద్యోగం పేరుతో రూ.7లక్షలు వసూలు చేయగా, శ్రీనగర్ కాలనీకి చెందిన రచ్చ నవిత కుమార్తెకు వైజాగ్‌లోని గీతం యూనివర్సిటీలో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానంటూ రూ.15లక్షలు వసూలు చేశాడు. ఆఫీసు ఏర్పాటు కోసం అంటూ అనురాధ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న రావి గౌతమి వద్దనుంచి రూ.70లక్షలు తీసుకున్న రోహిత్.. వివిధ కారణాలు చెబుతూ కాలయాపన చేశాడు. ఇటీవల గట్టిగా డబ్బులు ఇవ్వాలని కోరగా బాండ్ పేపర్ రాసిచ్చి అక్టోబర్ 25లోగా ఇస్తానంటూ హామీ ఇచ్చాడు. అయితే డబ్బులు ఇవ్వకపోగా ఆఫీసు మూసేసి పరార్ కావడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా చీటింగ్ కేసులు నమోదు చేశారు. రోహిత్ చేతిలో మోసపోయిన బాధితులు వందల సంఖ్యలో ఉన్నారని స్థానికులు చెబుతున్నారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



**అభినందన..**
విస్టా ఇంటర్నేషనల్ స్కూల్ స్పోర్ట్స్ మీట్‌లో విజేతలను శనివారం అభినందిస్తున్న భారత మాజీ వాలీబాల్ ప్లేయర్ కిరణ్‌రెడ్డి

# ప్రజల సహకారంతోనే.. సమస్యలు పరిష్కారం

### ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డెవిస్

మణికొండ, అక్టోబర్ 26: పజల సహకారంతోనే ట్రాఫిక్ సమస్యలను త్వరిత గతిన పరిష్కరించేందుకు సాధ్యమౌతుందని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డెవిస్ అన్నారు. సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్.సి.ఎస్.సి.) ఎలాంటి లాభాపేక్ష లేకుండా శాంతి భద్రతతో కూడిన రక్షణ ఆశ్రయ సంస్థ ద్వారా ట్రాఫిక్ నియంత్రణ పై అవగాహన కల్పించేందుకు సహకరించిన ప్రతినిధులకు కమిషనర్ సన్మానించి, అభినందించారు.ట్రాఫిక్ పోలీసులకు అన్నివిధాలుగా సహకరిస్తూ, విద్యార్థులల్లో ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన, ప్రజాప్రయోజన కార్యక్రమ నిర్వహణ సేవల్లో భాగంగా ట్రాఫిక్ సేఫ్టీ రోడ్డు మేనేజ్‌మెంట్ చర్యల్లో ముందుంటున్న వీఆర్ ఫర్ యూ సహాయోగ్ సంస్థ ప్రతినిధుల సేవలను అభినందించారు.

కార్యక్రమంలో ట్రాఫిక్ ఫోరం ప్రధాన కార్యదర్శి రమేశ్ ఖాజా, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, స్థానిక ఇన్‌చార్జి కేవశ్, నవీద్ ఖాన్, బాలరాజు, సహాయోగ్ చారిటబుల్ సంస్థ ప్రతినిధులు లక్ష్మణ్‌రావు అందె, దిలీప్ కక్కడ్ పాల్గొన్నారు.



వీ ఆర్ ఫర్ సహాయోగ్ ప్రతినిధికి అభినందన పత్రం అందజేస్తున్న జాయింట్ కమిషనర్ జోయల్ డెవిస్

## యూనివర్సిటీ అభివృద్ధికి సమష్టి కృషి



సమష్టి కృషి సంస్థ అభివృద్ధికి తోడ్పడుతుందని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డా.రాజిరెడ్డి అన్నారు. శనివారం టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగ సంఘాల నాయకులు ఆయనకు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యాన వర్సిటీ టీచింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా.చిన్నానాయక్, తూటా రాష్ట్ర నాయకులు డా.సురేశ్, డా.సైదయ్య, శ్రీనివాస్,సుచిత్ర, నిఖిల్ వారిలో ఉన్నారు. పరిశోధనా, విస్తరణ, ఉద్యాన పంటలపై క్షేత్రస్థాయి పర్యటనలు చేయాల్సిన అవసరం ఉందని, బయోటెక్నాలజీ, హైబ్రీడ్ రకాలను పరిచయం చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.

**- వ్యవసాయ యూనివర్సిటీ**

## రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన అవసరం

బంజారాహిల్స్ : రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద అన్నారు. ప్రపంచ రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసం సందర్భంగా శనివారం బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని రెనోవా సెంచరీ దవాఖాన ఆధ్వర్యంలో అవగాహన వాక్‌ను జస్టిస్ సూరేపల్లి నంద ప్రారంభించారు. ప్రతియేటా ప్రపంచ వ్యాప్తంగా 2.3 మిలియన్ కేసులు నమోదు కావడం ఆందోళన కలిగించే అంశమన్నారు. కార్యక్రమంలో రెనోవా సెంచరీ సర్జికల్ అంకాలజిస్ట్ డా. శ్రీనివాస్ జూలూరి, సీవోవో రవీంద్రనాథ్ గరగ, డా.శ్రీనివాస్, డా.అశ్విన్ పండిట్, డా, జ్యోతి , డా. అర్జున్, వైద్యులు పాల్గొన్నారు.



అవగాహన వాక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రాజనర్సింహా

### బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన వాక్

ఖైరతాబాద్ : ఎంఎన్‌జే ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో లుంబినీ పార్కు వద్ద బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన వాక్‌ను ఏర్పాటు చేశారు. వాక్‌ను వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, డైరెక్టర్ డాక్టర్ ఎం. శ్రీనివాసులుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ మాడి రఘురాం రెడ్డి, డిస్ట్రిక్ట్ గవర్నర్ వై. శ్రీనివాస చారి, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ బీజీ రెడ్డి, మాజీ గవర్నర్ ఎస్. మురళీకృష్ణ, సంపత్‌రెడ్డి, నిమ్మల రాజశేఖర్, శంకర్‌రావు పాల్గొన్నారు.



అవగాహన వాక్‌ను ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఖైరతాబాద్, అక్టోబర్ 26 : ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ ఎన్. వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం పంజాగుట్టలోని అరోరా కళాశాలలో అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ఓవర్ స్పీడ్, సిగ్నల్ జంపింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్నార న్నారు. ఈ ఏడాది 1700 మంది లైసెన్స్ లేని వారు, 100 మంది ట్రిపుల్ రైడింగ్ చేసిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. సుష్మ, హెచ్‌వోడీలు ఎన్. అంజలి, మహ్మద్ హుస్సేన్, ట్రాఫిక్ సిబ్బంది కృష్ణ, అబ్దుల్ మాజిద్ పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని రక్షించడంలో న్యాయవాదుల పాత్ర కీలకం

హిమాయత్‌నగర్ : రాజ్యాంగాన్ని రక్షించడంలో న్యాయవాదుల పాత్ర కీలకమని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని ఐఏఎల్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. న్యాయ వాదులపై దాడులు పెరిగిపోతున్నాయని, వృత్తి పరమైన బాధ్యతలను నిర్వహించే న్యాయ వాదుల కోసం రక్షణ చట్టం తీసుకురావాలన్నారు. నవంబర్ 30 నుంచి డిసెంబర్ 1వ వరకు హన్మకొండలో జరిగే రాష్ట్ర ద్వితీయ మహాసభలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో ఐఏఎల్ నాయకులు జనార్దన్, ఉదయ్ భాస్కర్, శ్రీనివాస్, మురళి, రాంమూర్తి, లీలా కుమారి, దామోదర్, రమణ, వెంకటరమణారెడ్డి, ఉదయ్, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఏఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్

## కమ్యూనిటీహాల్ ఆవరణలో చెత్తాచెదారం



వెంకటేశ్వరకాలనీ డివిజన్, షౌకత్‌నగర్ బస్తీలో జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్‌లో చెత్తాచెదారం నిండిపోయిందని స్థానికుల ఫిర్యాదుతో కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి శనివారం పర్యటించారు. చెత్తకుప్పలు, పిచ్చిమొక్కలతో హాల్ పరిసరాలు కనిపించడంపై కార్పొరేటర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శానిటేషన్ విభాగం అధికారులకు ఫిర్యాదు చేయడంతో సిబ్బంది క్లీనింగ్ పనులు చేపట్టారు.

**- బంజారాహిల్స్**

## ప్రమాదాల నివారణకు.. మేము సైతం



ట్రాఫిక్ క్రమబద్ధీకరణ ఒకటే కాదు.. రోడ్డు భద్రతకు కృషిని అందిస్తున్నారు రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు. వ్యవసాయ విశ్వవిద్యాలయం గేటుఎదుట ఉన్న రోడ్డును తాగునీటి పైపులైన్ల నిర్మాణానికి తవ్వడంతో పెద్దగుంత ఏర్పడింది. శుక్రవారం ఓ ఆర్టీసీ బస్సు ఆ గుంతలో పడటంతో ఓ బాలుడు కిందపడి గాయాలపాలు కాగా.. చికిత్స కోసం పోలీసులు దవాఖానకు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో గుంతను పూడ్చి వేయగా, వాహనదారులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

**- బండ్లగూడ**




### దళిత ఉద్యమకారులపై అనుచిత వ్యాఖ్యలు తగదు



పీఎస్‌లో ఫిర్యాదు అందజేస్తున్న యాదగిరి, శివ, మధుసూదన్

ఎర్రగడ్డ, అక్టోబర్ 26 : దళిత ఉద్యమకారులపై అనుచిత వ్యాఖ్యలు తగదని అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసుమొల్ల యాదగిరి అన్నారు. ఆదివారం బోరబండలో కమిటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొట్టు శివ ఏర్పాటు చేసిన సమావేశంలో యాదగిరి మాట్లాడుతూ.. ట్యాంక్‌బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి అడ్డుగా ప్రభుత్వం నిర్మించిన గోడను దళిత నాయకుల ఆధ్వర్యంలో కూలగొట్టటం జరిగిందన్నారు. దళిత ఉద్యమకారులపై మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్‌కుమార్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అనిల్‌కుమార్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బేగంబజార్ పీఎస్‌లో ఫిర్యాదు చేశామన్నారు. సమావేశంలో బీరకాయల మధుసూదన్ పాల్గొన్నారు.

### 29న మహాధర్నాను విజయవంతం చేయాలి



ఈ నెల 29న జరిగే మహాధర్నా విజయవంతం చేయాలని ఆటో, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ రాష్ట్ర అధ్యక్షుడు చింతల నందకిశోర్ కోరారు. శనివారం పట్టణంలో మహాధర్నా వాల్‌పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్, నాయకులు రవీందర్, నర్సింహ,సలీం, జగదీశ్, శ్రీను, రంజిత్, లడ్డు, కృష్ణ, శ్రీశైలం, దర్శన్, ప్రవీణ్, రవి, రమేశ్ పాల్గొన్నారు.

**- శంషాబాద్ రూరల్**

### వన్ టైమ్ సెటిల్ మెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జూబ్లీహిల్స్ : జలమండలి వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు 100 శాతం వడ్డీ మాఫీ చేస్తున్నారు. గడువు ఈ నెల 31 తో ముగియనున్నందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. జలమండలి డివిజన్- 6 లో బీపీఎల్ వినియోగదారులు మినహాయించి ఓటీఎస్ పథకానికి అర్హులను గుర్తించారు. వివరాలకు స్థానికంగా ఉన్న జలమండలి కార్యాలయాలు, 155313 టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# మొక్కుబడిగా కులగణన చేస్తే ఊరుకోం

ఖైరతాబాద్ : మొక్కుబడిగా కులగణన చేస్తే ఊరుకునేది లేదని వక్తలు అభిప్రాయపడ్డారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పీపుల్స్ కమిటీ ఆన్ కాస్ట్ సెన్సెస్, తెలంగాణ బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో కుల, ప్రజా సంఘాలు, మేధావులతో కులగణనపై పబ్లిక్ హియరింగ్ సభ ప్రొ. కె. మురళీమనోహర్, దేవళ్ల సమయ్య అ ధ్యక్షతన జరిగింది. పబ్లిక్ హియరింగ్ జ్యూరీ ప్యానల్ సభ్యులుగా రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు వ్యవహరించారు. సర్వే ప్రశ్నావళిలో ఉండే అంశాలను బహిర్గతం చేసి అఖిల పక్ష, కుల సంఘాలతో చర్చించి వివరాల సేకరణకు ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. సంచార జాతుల వివరాలు సైతం సేకరించాలని డిమాండ్ చేశారు. బీహార్‌లో సర్వే నిర్వహించారని, నిర్దిష్ట విధానాలను అవలంబించకపోవడంతో పాట్నా హైకోర్టు అక్కడి రిజర్వేషన్ పెంపు చట్టాన్ని కొట్టివేసిందన్నారు. అందుబాటులో ఉన్న కమిషన్ ఆఫ్ ఎన్‌క్వైరీస్ చట్టం-1952 ద్వారా సాధ్యమవుతుందన్నా రు. అభిప్రాయాలను పబ్లిక్ జ్యూరీ ప్యానెల్ నివేదిక రూపకల్పన చేసి ప్ర భుత్వానికి అందజేయనున్నట్లు తెలిపారు.

**42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుంటే..**

స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు చేస్తానని హామీ ఇచ్చి ప్రభుత్వం తాత్సారం చేసిందని బీసీ కమిషన్ మాజీ సభ్యులు సీహెచ్ ఉపేంద్ర అన్నారు. బీసీలకు న్యాయం చేయకపోగా, రెండు, మూడు శాతం కూడా లేని అగ్రవర్ణాల కోసం 10 శాతంతో కూడిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తీసుకువచ్చారన్నారు. బీసీ గణన చేసే క్రమంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై సైతం నిర్ణయం తీసుకోవాలన్నారు.

**కాంగ్రెస్ మొదటి నుంచే మోసం**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే బీసీలపై తన మోసపూరిత వైఖరిని బయటపెట్టుకుందని తెలంగాణ ఎంబీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నిమ్మల వీరన్న ఆరోపించారు. సభలో ప్రొ.సుదర్శన్ రావు, ప్రొ.భాగయ్య, డాక్టర్ పృథ్వీరాజ్ యాదవ్, సతీశ్ కొట్టె, వినోద్ కుర్వ, డాక్టర్ వేణుమాధవ్, డాక్టర్ తుల్జారాం సింగ్, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో రిటైర్డ్ జస్టిస్‌చంద్రకుమార్, డాక్టర్ కృష్ణమోహన్ రావు

## గ్రామాల గుర్తింపునకు ముఖద్వారాలు అవసరం

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 26 : గ్రామాల గుర్తింపునకు ముఖద్వారాలు అవసరమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ తెలిపారు. మదన్‌పల్లి పాత తండా గ్రామ ముఖద్వారాన్ని మాజీ వైస్ ఎంపీపీ దంపతులు నీలం మోహన్‌నాయక్ రూ.18 లక్షలతో నిర్మాణం చేశారు. ముఖద్వారాన్ని ఎమ్మెల్యే శనివారం ప్రారంభించి, మాజీ వైస్ ఎంపీపీ మోహన్‌నాయక్ దంపతులను అభినందించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తన్వి రాజు, చంద్రారెడ్డి, వెంకటేశ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ మోహన్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు దండు ఇస్తారి, రవి నాయక్, మాజ ఉప సర్పంచ్ ఆంజనేయులుగౌడ్, హన్మంతునాయక్, సురేశ్ నాయక్,జుర్కి రమేశ్, శ్రీకాంత్ గౌడ్, రవినాయక్, జిల్లా ఆనంద్, మహేందర్, పలువురు నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.



మదన్‌పల్లి పాతతండా ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న ప్రశాంత్‌నగర్ కాలనీ వాసులు

### అభివృద్ధికి చర్యలు తీసుకోండి

బండ్లగూడ : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కాలనీ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. తమ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాల కోసం చర్యలు తీసుకోవాలని వారు ఎమ్మెల్యేకు ప్రకాశ్‌గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు.

### 90 రోజుల డీ సిల్టింగ్ కార్యక్రమంలో

## ఓవర్ ఫ్లో సమస్యలకు చెక్

జూబ్లీహిల్స్, అక్టోబర్ 26 : జలమండలి ఆధ్వర్యంలో చేపడుతున్న 90 రోజుల డీ సిల్టింగ్ కార్యక్రమంలో సీవరేజీ సమస్యల శాశ్వత పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. శనివారం డివిజన్ – 6 లోని శ్రీరాంనగర్ తదితర ప్రాంతాల్లో హెచ్‌ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ అధికారుల బృందం విస్తృతంగా పర్యటించింది. సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని జలమండలి డైరెక్టర్ ఆపరేషన్స్ – 1 విజయరావు అధికారులను ఆదేశించారు. ఓవర్ ఫ్లో అవుతున్న కాలువల విస్తృతి పెంచాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సీజీఎం ప్రభు, జీఎం హరిశంకర్‌తో కలిసి పర్యటించారు. ఓవర్‌ఫ్లో అవుతున్న ప్రాంతాలు, సీసీపీ హాట్‌స్పాట్‌లనుహాట్‌స్పాట్‌లను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు.



పరిశీలిస్తున్న జలమండలి డీఓపీ –1 విజయరావు, సీజీఎం ప్రభు, జీఎం హరిశంకర్

## ఎక్సైజ్ స్టేషన్ల ఏర్పాటును పునః పరిశీలించాలి

హిమాయత్‌నగర్ : అశాస్త్రీయంగా ఏర్పాటు చేసిన ఎక్సైజ్ స్టేషన్లను పునఃపరిశీలించాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగేందర్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పాటు చేసిన ఎక్సైజ్ స్టేషన్లలో పోస్టులను మంజూరు చేయకుండా, వివిధ జిల్లాల నుంచి తరలించి కేటాయించడం సరైన నిర్ణయం కాదన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో అద్దెకు భవనాలు దొరకక గోల్కొండ స్టేషన్‌ను ఎక్సైజ్ అకాడమీలో, శేరిలింగంపల్లి స్టేషన్ శిథిలావస్థలో ఉన్న అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలకు మేలు జరిగేలా పునర్విభజించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బడేసాబ్, సాయిబాబా, సుమన్, నగేశ్, నవీన్ పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న యుగేందర్ గౌడ్


### కేబీఆర్ పార్కు సమీపంలో సమస్యలు లేకుండా చూడండి



కేబీఆర్ పార్కు చుట్టుపక్కల ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్ ఆదేశించారు. శనివారం సాయంత్రం వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్‌తో కలిసి మెయిన్ గేట్ పరిసర ప్రాంతాల్లో పరిశీలించారు. గేట్ నం. 10 సమీపంలో ఉన్న ఫ్రీ లెఫ్ట్‌ను బ్లాక్ చేస్తూ కొందరరు వాకర్లు ఉదయం వాహనాలు పార్క్ చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. నిర్దేశిత ప్రాంతాల్లో మాత్రమే కార్లను పార్క్ చేసేలా చూడాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా ఉదయం 7 : 30 తర్వాత వాహనాలు పార్క్ చేస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. **- బంజారాహిల్స్**



ఖైరతాబాద్, అక్టోబర్ 26 : విశ్వ హిందూ రక్ష పరిషత్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో జాతీయ మహిళా అధ్యక్షురాలిగా ఎన్నికైన యమునా పాఠక్, రాష్ట్ర అధ్యక్షురాలిగా దొంతి శిల్పా రెడ్డి, హైదరాబాద్ పట్టణ అధ్యక్షురాలు ప్రసన్నలకు జాతీయ అధ్యక్షుడు గోపాల్ రాయ్ నియామకపత్రాలను అందజేశారు.



వెంగళరావునగర్ : జీటీఎస్ కాలనీలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ వారి శ్రీవీరాంజనేయ భవానీ శంకర అయ్యప్ప సహిత షిర్డీ సాయిబాబా ఆలయంలోని శీతల భవానీ ఆలయంలో ఈఓ సుధాకర్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు ఎస్.ఆంథోని, శ్రీనివాస్ గౌడ్, మీనాక్షి పూజలు చేశారు.